క్లుప్తంగా

కార్యవర్గం ఎన్నిక

దుగ్గొండి : మండలంలోని నాచినపల్లిలోని విశ్వకర్మ వీధిలో వారాహి యూత్ అసోసియేషన్ నూతన కార్యవర్గాన్ని ఆదివారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడుగా కొమ్మెర నాగరాజు, ఉపాధ్యక్షుడుగా శ్రీరామోజు రాకేశ్, కార్యదర్శిగా కొమ్మెర రవి, కోశాధికారిగా కొమ్మెర రమేశ్, కార్యవర్గ సభ్యులుగా రాహుల్, దామోదర్, రుద్రారపు రాజు, కొమ్మెర చిన్నరాజు, మను ఎన్నికయ్యారు. నూతన కార్యవర్గాన్ని పలువురు అభినందించారు.

నేడు బీఆర్ఎస్ సమావేశం

పర్వతగిరి : నేడు (సోమవారం) మండలంలోని కల్లెడ సొసైటీ ఫంక్షన్ హాలులో బీఆర్ఎస్ విస్తృత స్థాయి సమావేశం నిర్వహించనున్నట్లు ఆ పార్టీ మండల అధ్యక్షుడు, మాజీ వైస్ ఎంపీపీ ఎర్రబెల్లి రాజేశ్వర్‌రావు తెలిపారు. ఆయన మీడియాతో ఆదివారం మాట్లాడారు. సమావేశానికి మాజీ మంత్రి, వర్ధన్నపేట నియోజకవర్గ ఇన్‌చార్జి ఎర్రబెల్లి దయాకర్‌రావు హాజరవుతారని చెప్పారు. మండల పరిధిలోని అన్ని గ్రామాలకు చెందిన పార్టీ జిల్లా, మండల నాయకులు, మాజీ ప్రజాప్రతినిధులు కమిటీల అధ్యక్ష, కార్యదర్శులు, అనుబంధ సంఘాల అధ్యక్ష, కార్యదర్శులు, నాయకులు హాజరు కావాలని కోరారు.

నివాళి



నర్సంపేట రూరల్ : నర్సంపేట మండలంలోని రాజపల్లికి చెందిన రేగుల నర్సమ్మ అనారోగ్యంతో మృతి చెందగా ఆమె మృతదేహానికి ముదిరాజ్ అఫీషియల్స్ అండ్ ప్రొఫెషనల్స్ అసోసియేషన్ (మెపా) వ్యవస్థాపక రాష్ట్ర అధ్యక్షుడు పులి దేవేందర్ ఆదివారం పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం బాధిత కుటుంబాన్ని ఆయన పరామర్శించారు. కార్యక్రమంలో అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పొన్నం రాజు, డివిజన్ గౌరవ అధ్యక్షుడు పిట్టల కుమార్, జిల్లా ప్రధాన కార్యదర్శి పెండ్యాల కృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

కొత్తూరులో..

ఖానాపురం : మండలంలోని కొత్తూరు గ్రామానికి చెందిన ఉప్పలమ్మ అనారోగ్యంతో మృతి చెందగా ఆమె మృతదేహానికి మాజీ ఎంపీపీ వేములపల్లి ప్రకాశ్‌రావు, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ బత్తిని శ్రీనివాస్ గౌడ్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు జాటోతు రమేశ్, పోతరాజు కట్టయ్య, ఐలయ్య, సురేశ్, చంద్రయ్య, రవి, పైడి, తదితరులు పాల్గొన్నారు.

కోటలో మిలాద్ ఉన్ నబీ

ఖిలా వరంగల్ : వరంగల్ మధ్యకోట మసీదు ఆవరణలో ముస్లిం మతపెద్దల ఆధ్వర్యంలో మిలాద్ ఉన్ నబీ వేడుకలను ఆదివారం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా స్థానిక కార్పొరేటర్ బైరబోయిన ఉమ హాజరై అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో దామోదర్ యాదవ్, మహమ్మద్ రఫీక్, గౌస్, సిరాజుద్దీన్, అశ్రఫ్, ఆశు తదితరులు పాల్గొన్నారు.

సన్మానం

ఖిలా వరంగల్ : రంగశాయిపేటకు చెందిన ప్రభుత్వ వ్యాయామ ఉపాధ్యాయుడు బొలిశెట్టి కమలాకర్ గతనెల 31న పదవీ విరమణ పొందారు. ఈ క్రమంలో వరంగల్ రంగశాయిపేటలో ఆదివారం జరిగిన సమావేశంలో కమలాకర్‌ను రాష్ట్ర శాసన మండలి డిప్యూటీ చైర్మన్ డాక్టర్ బండా ప్రకాశ్ సన్మానించారు. వ్యాయామ ఉపాధ్యాయుడిగా పనిచేస్తూ యోగా గురువుగా పేరు ప్రఖ్యాతలు సంపాదించుకోవడం అభినందనీయమని ప్రకాశ్ కొనియాడారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ అధ్యక్షురాలు ప్రేమలతారెడ్డి, రవికుమార్, పాకాల కృష్ణవేణి, లక్ష్మీనారాయణ, శ్రీధర్, మన్నె వెంకటేశ్వర్లు, తదితరులు పాల్గొన్నారు.

ఆర్వో వాటర్ ప్లాంట్ ప్రారంభం

ఖిలా వరంగల్ : వరంగల్ 42వ డివిజన్ రంగశాయిపేటలోని లెనిన్‌నగర్ కాలనీలో రోటరీ క్లబ్ ఆఫ్ వరంగల్ సెంట్రల్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఆర్వో వాటర్ ప్లాంట్‌ను స్థానిక కార్పొరేటర్ గుండు చందనతో కలిసి చిప్ప వెంకటేశ్వర్లు, డాక్టర్ శరత్‌బాబు, డాక్టర్ కంచ ప్రసాద్ ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 600 కుటుంబాలకు స్వచ్ఛమైన నీటిని అందించేందుకు వాటర్‌ప్లాంట్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ సదుపాయాన్ని ప్రజలు వినియోగించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో రోటరీ ప్రతినిధులు అశోక్‌బాబు, నరేష్, రాజేందర్, ప్రభాకర్‌రెడ్డి, సురేష్ బాబు రత్నాకర్, చిన్నాల సత్యనారాయణ, ప్రసాద్, కిరణ్, వేణు, అనిల్, గోరంట్ల మనోహర్ పాల్గొన్నారు.

పూర్వవిద్యార్థుల సమ్మేళనం

కొత్తగూడ : ఖానాపూర్ మండలం బుధరావుపేట ప్రాథమికోన్నత పాఠశాలలో 1వ తరగతి నుంచి 7వ తరగతి వరకు చదువుకున్న పూర్వవిద్యార్థులు గుంజేడు ముసలమ్మ ఆలయంలో ఆదివారం సమ్మేళనం నిర్వహించారు. అమ్మవారికి పూజలు చేసి చిన్ననాటి జ్ఞాపకాలను నెమరు వేసుకున్నారు.

మల్చింగ్ సాగు.. లాభాలు బాగు

- కలుపు కూలీల కొరతకు చెక్
- షీట్ల కోసం దరఖాస్తుల స్వీకరణ

సంగెం : మల్చింగ్.. ఆధునిక వ్యవసాయంలో అత్యంత ప్రభావవంతమైన సాంకేతికత. ఇది పంటల దిగుబడిని, స్థిరత్వాన్ని మెరుగుపర్చాలనుకునే రైతులకు బహుళ ప్రయోజనకారి అని చెప్పొచ్చు. వర్షాలు, నీటి తడులతో పంట చేలల్లో కలుపు మొక్కలు పెరిగి రైతులకు ఇబ్బందిగా పరిణమించడం తెలిసిందే. కూలీలు దొరక్కపోవడంతో పంటల ఎత్తును మించి కలుపు మొక్కలు పెరిగి తీవ్ర నష్టం కలిగిస్తున్నాయి. కొందరు రైతులు కలుపు తీయించినా లాభం లేదంటూ పంటను వదిలేస్తున్న దుస్థితి నెలకొంటోంది. ఈ నేపథ్యంలో కలుపు మొక్కలు రాకుండా రైతులు మల్చింగ్ షీట్‌ను ఉపయోగిస్తున్నారు.

మల్చింగ్ షీట్‌తో ప్రయోజనాలు

మల్చింగ్ షీట్ సూర్యరశ్మిని నేల ఉపరితలం చేరకుండా నిరోధిస్తుంది. కలుపు పెరుగుదలను గణనీయంగా తగ్గిస్తుంది. రసాయన కలుపు మందుల అవసరాన్ని తగ్గిస్తుంది. నేలలో తేమను కాపాడటం ద్వారా పొడి కాలంలో మొక్కలు వృద్ధి చెందడానికి సహాయ పడుతుంది. నీటి పారుదల అవసరాలను తగ్గిస్తుంది. చల్లని వాతావరణంలో, ప్లాస్టిక్ మల్చింగ్ షీట్ నేలను వేడి చేస్తుంది. ముందస్తు నాటడానికి వీలు కల్పిస్తుంది. మొలకల పెరుగుదలను వేగవంతం చేస్తుంది. మల్చింగ్ షీట్ నేల, మొక్కల మధ్య అవరోధంగా పని చేస్తుంది. నేల ద్వారా సంక్రమించే వ్యాధి కారకాలు, సంబంధిత వ్యాధుల నుంచి పంటలను రక్షించడంలో సహాయ పడుతుంది. మల్చింగ్ షీట్ కింద పెరిగిన మొక్కలు అనుకూలమైన, పెరుగుతున్న పరిస్థితుల కారణంగా పెరిగిన దిగుబడితో అధిక నాణ్యత పంటలను ఉత్పత్తి చేస్తాయి. నియంత్రిత నేల ఉష్ణోగ్రతలు,



మల్చింగ్ షీట్ వేసి నాటిన మిర్చి తోట

రైతులు పెరిగిన పంట కాలాన్ని పొడిగించుకోవడానికి, పంట సామర్థ్యాన్ని పెంచడానికి తోడ్పడతాయి. ప్లాస్టిక్ మల్చింగ్ షీట్ గాలి, వర్షం వల్ల కలిగే కోత నుంచి నేల ఉపరితలాన్ని రక్షిస్తుంది. నేల ఆరోగ్యాన్ని కాపాడుకోవడానికి తోడ్పడుతుంది. మల్చింగ్ వల్ల కలిగే ప్రయోజనాల మిశ్రమ ప్రభావాలు వ్యవసాయ ఉత్పాదకత, స్థిరత్వాన్ని గణనీయంగా పెంచుతాయి. మల్చింగ్ షీట్ ఏర్పాటు సమర్థవంతమైన వనరుల వినియోగం కోసం స్థిరమైన ఎంపిక.

మల్చింగ్ షీట్లు వాడే పంటలు

మల్చింగ్‌ను పండ్ల తోటలైన అరటి, బొప్పాయి తోపాటు వాణిజ్య పంటలు మిరప, పసుపు, కూరగాయల తోటలు.. అలాగే టమాట, వంగ, పచ్చిమిర్చి, కాకర, బోడకాకర, దొండ, సోరకాయ, బీర, పూలతోటలు గులాబీ, బంతి, చేమంతి, సంపంగి, లిల్లీ తదితర పంటలకు మల్చింగ్ వాడుకుంటే కలుపు నివారణతోపాటుగా ఎరువుల వినియోగం సక్రమంగా జరిగి అధిక దిగుబడులు సాధించవచ్చు.

హెక్టారుకు రూ 20వేల రాయితీ

జిల్లాలో మల్చింగ్ షీట్లు రాయితీ 570 హెక్టార్లకు ప్రభుత్వం కేటాయించింది. ఇప్పటివరకు 333 హెక్టార్లకు మల్చింగ్ షీట్ల కోసం రైతులు దరఖాస్తు చేసుకున్నారు. ఇందులో ఇప్పటికే కొందరికి సరఫరా అయ్యాయి. ఒక్కో రైతుకు రెండు హెక్టార్ల వరకు రాయితీపై మల్చింగ్ లభిస్తుంది. ఇంకా 237 హెక్టార్లకు మల్చింగ్ ఇవ్వడానికి అవకాశం ఉంది. ఆసక్తి, అవసరం ఉన్న రైతులు మల్చింగ్ కోసం దరఖాస్తులు చేసుకోవచ్చు. మల్చింగ్ షీట్‌ను జాగ్రత్తగా వాడుకుంటే 3, 4 పంటలకు ఉపయోగించుకోవచ్చు. ఇతర వివరాల కోసం సెల్ నంబర్ 8977714060లో సంప్రదించాలి.

– ఎస్.తిరుపతి, ఉద్యానవన శాఖ అధికారి

కాంగ్రెస్ వైఫల్యాలను ఎండగట్టాలి

- మాజీ ఎమ్మెల్యే కొండేటి శ్రీధర్



సమావేశంలో మాట్లాడుతున్న కొండేటి శ్రీధర్

వర్ధన్నపేట : కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లో ఎండగట్టాలని స్థానిక మాజీ ఎమ్మెల్యే, బీజేపీ అనుబంధ ఎస్సీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు కొండేటి శ్రీధర్ శ్రేణులకు సూచించారు. మండలంలోని ఇల్లందలో ఎంపీటీసీ ఎన్నికల విభాగం మండల కన్వీనర్ రాయపురపు కుమారస్వామి అధ్యక్షతన ఆదివారం నిర్వహించిన పార్టీ ముఖ్యకార్యకర్తల సమావేశానికి శ్రీధర్ అతిథిగా హాజరై మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ మోసపూరిత హామీలతో అధికారంలోకి వచ్చిందన్నారు. రాబోయే స్థానిక ఎన్నికల్లో పార్టీ అభ్యర్థుల గెలుపే లక్ష్యంగా నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలని చెప్పారు. బూత్ స్థాయి నుంచి కార్యకర్తలు కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం, ప్రధాని నరేంద్ర మోదీ చేపడుతున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి పనులను ప్రజలకు వివరించాలని కోరారు. సమావేశంలో పార్టీ మండల అధ్యక్షురాలు కొండేటి అనిత, జిల్లా ఉపాధ్యక్షుడు కొండేటి సత్యం, ఎంపీటీసీ ఎన్నికల విభాగం మండల కోకన్వీనర్ మైస రాము, ప్రభారీలు పెద్దూరి రాజ్‌కుమార్, బోయినపల్లి దేవేందర్‌రావు, జిల్లా ఉపాధ్యక్షులు నాంపల్లి యాకయ్య, వెంకటస్వామి, శక్తి కేంద్రం ఇన్‌చార్జ్ సట్ల అనిల్, తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుడికి నేషన్ బిల్డర్ అవార్డు



అవార్డు అందుకుంటున్న మొగిలి

నర్సంపేట : చెన్నారావుపేట మండలంలోని ఉప్పరపల్లి జెడ్పీ హైస్కూల్ ఉపాధ్యాయుడు లెంకలపల్లి మొగిలి రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో నేషన్ బిల్డర్ అవార్డు అందుకున్నారు. హన్మకొండలో నిర్వహించిన వేడుకలో ఉత్తమ ఉపాధ్యాయుడిగా ఎంపికైన మొగిలికి క్లబ్ ప్రతినిధులు అవార్డు అందించి సత్కరించారు. ఈ సందర్భంగా క్లబ్ అధ్యక్షుడు బేతి రవీందర్‌రెడ్డి, కార్యదర్శి గంగోజుల నరేశ్, కోశాధికారి రాజ్‌కుమార్, మిరియాల రొటేరియన్ అందె వేణు మాట్లాడారు. పదో తరగతిలో పదేళ్లుగా నూరు శాతం విద్యార్థుల ఉత్తీర్ణత, బడిబాటలో విద్యార్థులను చేర్పించడం, విద్యార్థుల రవాణా కోసం సొంత డబ్బుతో ఆటో ఏర్పాటు, నోటు పుస్తకాల పంపిణీ, విద్యార్థినులకు సైకిళ్ల అందజేత, వ్యక్తిగత ఆర్థికసాయం, ఆయుర్వేద వైద్యశిబిరం ఏర్పాటు, స్వచ్ఛంద సంస్థల సహకారంతో మొండ్రాయి పాఠశాలకు 40 డ్యూయల్ డెస్క్ బెంచీలు, టేబుళ్లు, ప్రింటర్ అందజేత వంటి కార్యక్రమాలు చేపట్టినందుకు గాను మొగిలి సేవలను గుర్తించి అవార్డు అందించినట్టు తెలిపారు. కార్యక్రమంలో ఉప్పరపల్లి జెడ్పీ హైస్కూల్ హెచ్ఎం తేజావత్ జయ, ఉపాధ్యాయులు రాగి శశిధర్, కె.సంతోశ్ కుమార్, పిన్నింటి బాలాజీరావు, గజవెల్లి సుందర్, వర్దెల్లి సతీశ్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

మున్నూరుకాపు కులస్తులు రాణించాలి



నర్సంపేటలో రాజ్యలక్ష్మిని సన్మానిస్తున్న ప్రసాద్, తదితరులు

- పరపతి సంఘం అధ్యక్షుడు ప్రసాద్

నర్సంపేట : మున్నూరుకాపు కులస్తులు విద్యారంగంలో రాణించాలని మున్నూరుకాపు పటేల్ పరపతి సంఘం పట్టణ అధ్యక్షుడు నాగిశెట్టి ప్రసాద్ ఆకాంక్షించారు. జిల్లా ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికైన ఆ కులానికి చెందిన ఉపాధ్యాయులు శ్రీరాంశెట్టి రాజ్యలక్ష్మి, లక్కాకుల రమేశ్‌లను సంఘం ఆధ్వర్యంలో పట్టణంలో ఆదివారం శాలువాలు, పూలమాలలతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ప్రసాద్ మాట్లాడారు. కులస్తులు వివిధ ఉద్యోగాల్లో రాణించి దేశ, రాష్ట్ర కీర్తిప్రతిష్టలు ఇనుమడింపజేయాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు అలువాల భిక్షపతి, పరాచికపు సదానందం, గందె చంద్రమౌళి, నూకల కృష్ణమూర్తి, వాసంశెట్టి సంపత్‌రావు, శీలం రమేశ్, గంగ్రాతి రమేశ్, వీరభద్రం, కడారి కుమారస్వామి, బండి సుధాకర్, తదితరులు పాల్గొన్నారు.

చెన్నారావుపేటలో..

రాష్ట్ర స్థాయి ఉత్తమ ఉపాధ్యాయురాలిగా సీఎం చేతుల మీదుగా హైదరాబాద్‌లో అవార్డు అందుకున్న చెన్నారావుపేట మండలంలోని పాపయ్యపేటకు చెందిన లింగాల ప్రవీణ్‌కుమార్ సతీమణి సునీతను గ్రామస్తులు శాలువాతో సన్మానించారు. రాష్ట్రస్థాయిలో ఉత్తమ అవార్డు అందుకోవడం పట్ల అభినందించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ జిల్లా కార్యదర్శి మొగిలి వెంకట్‌రెడ్డి, పార్టీ గ్రామ కమిటీ అధ్యక్షుడు కంచ ప్రభాకర్, మైనార్టీ సెల్ మండల అధ్యక్షుడు మహ్మద్ అమీరుద్దీన్, నాయకులు ఉప్పరి కొమురయ్య, మేడి సాయి, కన్నం కుమార్, కుండె భద్రయ్య, ఉప్పరి నర్సింహస్వామి, మొర్రి వీరస్వామి, అన్న కొమురయ్య, మహేందర్, అన్న బోయిన అనిల్, లింగాల సారంగం, లింగాల రవీందర్, లింగాల సదయ్య, లింగాల శ్రావణ్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.



సునీతను సన్మానిస్తున్న గ్రామస్తులు

మండల కమిటీ ఎన్నిక



నర్సంపేట : జాతీయ మానవ హక్కుల సంఘం చెన్నారావుపేట మండల కమిటీని రాష్ట్ర అధ్యక్షుడు మొగుళ్ల భద్రయ్య ఆదేశాల మేరకు జిల్లా ప్రధాన కార్యదర్శి సంగెం రమేశ్ ఆధ్వర్యంలో ఆదివారం ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన సమావేశంలో కమిటీని రమేశ్ ప్రకటించారు. అధ్యక్షుడుగా మంద నరేశ్, ఉపాధ్యక్షురాలిగా అలువాల కల్యాణి, ప్రధాన కార్యదర్శిగా నూనె తిలక్, మండల అధికార ప్రతినిధిగా భూక్య రాజు, సోషల్ మీడియా ఇన్‌చార్జ్‌గా మొర్రి సంతోశ్, సభ్యులుగా బాదావత్ చందర్, కె.శివ, బాదావత్ సురేశ్ ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా అధ్యక్షుడు నరేశ్ మాట్లాడారు. మానవ హక్కుల పరిరక్షణకు పాటుపడతామని తెలిపారు. అవినీతి, అక్రమాలకు తావులేకుండా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామన్నారు.

పేద కుటుంబానికి గ్రామస్తుల ఆపన్నహస్తం



బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం అందిస్తున్న గ్రామస్తులు

నల్లబెల్లి : నిరుపేద కుటుంబానికి గ్రామస్తులు ఆపన్నహస్తం అందించి ఆదర్శంగా నిలిచారు. వివరాలిలా.. మండలంలోని కొండాయిల్‌పల్లి గ్రామానికి చెందిన రేశోజు రాజయ్య ఇటీవల అనారోగ్యం బారిన పడగా కడు పేదరికంలోనూ కుటుంబీకులు రూ.2 లక్షలు అప్పు చేసి వైద్యం చేయించారు. అయినా పరిస్థితి విషమించి రాజయ్య మృతి చెందాడు. రాజయ్య మృతితో మరింత పేదరికంతో బాధిత కుటుంబం తీవ్ర ఇబ్బందులు పడుతున్న విషయం తెలిసి గ్రామస్తులు చలించారు. బాధిత కుటుంబానికి పలువురు కలిసి ఆదివారం రూ.55,700 నగదు సాయంగా అందించారు. అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు మామిండ్ల మోహన్‌రెడ్డి, కొనుకటి లింగారెడ్డి, ఎద్దు ఐలయ్య, కొలగాని అనంతరావు, పెంతల కొమురారెడ్డి, కొలగాని రామారావు, తాడెబోయిన విజయ్, ఎద్దు హరిమోహన్, పొన్నం వెంకటేశ్వర్లు, తదితరులు పాల్గొన్నారు.

నేడు ఎమ్మెల్యే క్యాంపు ఆఫీస్ ముట్టడి



వర్ధన్నపేట : మాట్లాడుతున్న పాపారావు



ఖానాపురం : మాట్లాడుతున్న సంజీవ

వర్ధన్నపేట : మాల కుల ప్రజలను నష్టం కలిగించేలా ప్రభుత్వం తీసుకొచ్చిన జీఓ నంబర్ 99 రద్దు డిమాండ్ చేస్తూ నేడు వర్ధన్నపేట ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయాన్ని ముట్టడిస్తామని మాల మహానాడు జిల్లా కార్యదర్శి బెజ్జం పాపారావు తెలిపారు. పట్టణంలో ఆదివారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం మాల కులస్తుల పట్ల వివక్ష పాటిస్తోందని ఆరోపించారు. జీఓ నంబర్ 99 తీసుకొచ్చి మాల కుల విద్యార్థుల భవిష్యత్తును నాశనం చేస్తోందని ధ్వజమెత్తారు. జీఓను వెనక్కి తీసుకోవాలని, రోస్టర్ పాయింట్లు 22 నుంచి వన్ పాయింట్‌కు తగ్గించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో జిల్లా యూత్ అధ్యక్షుడు ఉసిల్ల ఉదయ్‌కుమార్, జిల్లా ప్రధాన కార్యదర్శి గొర్రె రమేశ్, మహిళా ఉపాధ్యక్షురాలు ఒగ్గుల మాధవి, నాయకులు శోభన్, రవి, విజేందర్, రఘు, వరకుమార్, తదితరులు పాల్గొన్నారు.

రోస్టర్ విధానాన్ని రద్దు చేయాలి

ఖానాపురం : ఎస్సీ వర్గీకరణలో జీఓ 99 రోస్టర్ పాయింట్ విధానాన్ని రద్దు చేయాలని మాల మహానాడు రాష్ట్ర నాయకులు గద్దె సంజీవ, ముదుసు రమేశ్ డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు. సదరు జీఓ కారణంగా ఎస్సీ గ్రూపులోని 25 కులాల ప్రజలకు నష్టం వాటిల్లుతోందని చెప్పారు. సమావేశంలో సంఘం బాధ్యులు దావీదు, సాలయ్య, సురేశ్, వెంకటరత్నం, వీరస్వామి, వెంకన్న, కొమురయ్య, కాంతమ్మ తదితరులు పాల్గొన్నారు.

‘1962’ అంబులెన్స్‌కు సుస్తీ

- చెడిపోయిన పశు వైద్యశాల అంబులెన్స్



సంచార పశువైద్యశాల వాహనం

రాయపర్తి : 1962 ఉచిత సంచార పశు వైద్యశాల వాహనానికి సుస్తీ చేసింది. అత్యవసర సమయంలో వైద్యం అందక మూగజీవాలు మృత్యువాత పడుతున్నాయి. వర్ధన్నపేట నియోజకవర్గంలోని పర్వతగిరి, రాయపర్తి, ఐనవోలు, వర్ధన్నపేట మండలాలకు కలిపి ఒకే సంచార పశు వైద్యశాల అంబులెన్స్ సేవలు అందిస్తుండగా అది కాస్తా చెడిపోయి మరమ్మతుకు నోచుకోని దుస్థితి నెలకొంది.

నియోజకవర్గ పరిధిలోని సుమారు 200కుపైగా గ్రామాల్లోని మూగజీవాలకు పశు వైద్యశాల ఆధ్వర్యంలో సేవలు అందించేందుకు ప్రభుత్వం 1962 వాహనం కేటాయించింది. అది రిపేర్‌కు వచ్చి సుమారు నెల రోజులు అవుతోంది. మరమ్మతు కోసం జిల్లా కేంద్రానికి తరలించగా అది మూలన పడింది. సంబంధిత శాఖ ఉన్నతాధికారులు సైతం వాహన మరమ్మతుపై దృష్టి సారించడం లేదన్న అపవాదు ఉంది. అత్యవసర పరిస్థితుల్లో మూగజీవాలు వైద్యం అందక పాడి రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈఎంఆర్ఐ, జీవీకే సంస్థ ద్వారా ప్రభుత్వం అందించే పశు వైద్యసేవలు గొర్రెల పెంపకందారులకు చేరడం లేదు. నియోజకవర్గానికి కేటాయించిన ఒకే ఒక్క వాహనం మరమ్మతుకు గురి కావడంతో సదరు మండలాల్లోని పాడి రైతులు నానా అవస్థలు పడుతున్నారు. అసలే వానాకాలం కావడంతో పశువులకు పలు రకాల రోగాలు, అంటువ్యాధులు సోకే ప్రమాదం తెలిసిందే. ప్రాథమిక దశలో మూగజీవాలకు అత్యవసర చికిత్స అందించే లక్ష్యంతో ఉచిత సంచార పశు వైద్యశాల 1962 వాహనం కేటాయించిన ప్రాధాన్యతను విస్మరించారన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఈ క్రమంలో ఆవులు, గేదెలు, మేకలు, గొర్రెలు తదితర మూగజీవాలకు పల్లెల్లోనే ఉచిత వైద్యం అందని ద్రాక్షగానే మిగులింది. ఆయా మండలాల్లోని పశు వైద్యశాలలకు తీసుకువెళ్లే వరకు మూగజీవాలు ప్రాణాలు కోల్పోతున్నాయని పాడి రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇకనైనా అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి సంచార పశు వైద్యశాల 1962 అంబులెన్స్‌కు మరమ్మతు చేయించి వినియోగంలోకి తీసురావడంతోపాటు వాహనంలో మందులు, ఇంజెక్షన్లు, మాత్రలు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని పాడి రైతులు, మండల ప్రజలు కోరుతున్నారు.

ఇబ్బంది పడుతున్నాం



నాకు గేదెలు ఉన్నాయి. ఇటీవల గేదెకు ఆరోగ్యం బాగాలేక పోవడంతో స్థానిక పశు వైద్యశాల డాక్టర్ వచ్చి చూసే సరికి ప్రాణం పోయింది. దీంతో రూ.90 వేల నష్టం వాటిల్లింది. పాడి రైతులకు 1962 అంబులెన్స్ సేవలు అందుబాటులోకి తీసుకురావాలి. మూగజీవాలు మృత్యువాత పడకుండా అధికారులు చర్యలు తీసుకోవాలి.

– ఇస్లావత్ లాలు, పాడి రైతు, పర్వతగిరి

సేవలు అందడం లేదు



నాకు మూడు వందల గొర్రెలు, ఆవులు, గేదెలున్నాయి. గతంలో 1962కు ఫోన్ చేస్తే అత్యవసర సమయంలో వైద్యులు వచ్చి చికిత్స చేసే పరిస్థితి ఉండేది. కొంత కాలంగా ఆ అంబులెన్స్ సేవలు అందడం లేదు. ఫోన్ చేస్తే సమాధానం ఇవ్వడం లేదు. అత్యవసర సమయంలో వైద్యం అందక జీవాలు చనిపోతున్నాయి.

– దేవేందర్, పాడి రైతు, తెట్టెకుంటతండా

నేత్రదానంపై అవగాహన అవసరం



పడమర కోటలో నేత్రదానంపై మహిళలకు అవగాహన కల్పిస్తున్న డాక్టర్ పరికిపండ్ల అశోక్

ఖిలా వరంగల్ : నేత్రదానంపై అవగాహన పెంచుకోవాలని తెలంగాణ నేత్ర, అవయవ, శరీర దాతల సంఘం రాష్ట్ర సహాధ్యక్షుడు పరికిపండ్ల అశోక్ కోరారు. జాతీయ నేత్రదాన పక్షోత్సవాల సందర్భంగా ఖిలా వరంగల్ పడమర కోట పద్మశాలి కమ్యూనిటీ హాల్‌లో తెలంగాణ నేత్ర, అవయవ దాతల సంఘం ఆధ్వర్యంలో మహిళా సంఘాల ప్రతినిధులు, మహిళలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. అవయవ దానంలో దేశంలో రాష్ట్రం ప్రథమ స్థానంలో ఉందన్నారు. కార్యక్రమంలో డాక్టర్ దర్శిని, సావిత్రి, పరంజ్యోతి, కవిత, సుమతి, దీప తదితరులు పాల్గొన్నారు.

11నుంచి రైతాంగ సాయుధ పోరాట వారోత్సవాలు

వరంగల్ చౌరస్తా : భూమి, భుక్తి, విముక్తి కోసం సాగిన తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట వారోత్సవాలను ఈనెల 11 నుంచి 17వ తేదీ వరకు నిర్వహించనున్నట్లు ఎంసీపీఐ (యూ) వరంగల్ జిల్లా కార్యదర్శి పెద్దారపు రమేష్ తెలిపారు. వరంగల్ అండర్ బ్రిడ్జి ఓంకార్ భవన్‌లో ఎంసీపీఐ (యూ) నగర కమిటీ సమావేశాన్ని ఎగ్గని మల్లికార్జున్ అధ్యక్షతన ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా రమేష్ మాట్లాడుతూ చారిత్రాత్మకమైన తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటం 1946 నుంచి 1952 వరకు సాగిందని గుర్తుచేశారు. ఈ క్రమంలో ఎర్రజెండా నాయకత్వాన నైజాం రజాకార్లకు వ్యతిరేకంగా పోరాడినట్లు చెప్పారు. తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటానికి నిజమైన వారసులు కమ్యూనిస్టులేనని అన్నారు. సమావేశంలో పార్టీ నగర కార్యదర్శి మాలోత్ సాగర్, సహాయ కార్యదర్శి సుంచు జగదీశ్వర్, ముక్కెర రామస్వామి, ఏరియా కార్యదర్శులు ఐత నాగేష్, గణిపాక ఓదెలు, మహబూబ్ పాషా, మాలి ప్రభాకర్, మాలోత్ ప్రత్యూష, నర్సయ్య, రవీందర్ రాజేందర్, రవి, రామస్వామి తదితరులు పాల్గొన్నారు.